
సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 29 । మార్చి । 2024



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి వక్కలంక వేంకటేశ్వరరావు, సూర్య కుమారి దంపతులు (ఏలేశ్వరం) రూ.1,00,116 విరాళం గురువారం సమర్పించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని వదిలారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సెహరీ శని (ఉ॥)
రాజమహేంద్రవరం	6.24	4.38
కాకినాడ	6.24	4.38
అమలాపురం	6.24	4.38

న్యూస్‌రీల్

కోటసత్తెమ్మకు రూ.22.03 లక్షల హుండీ ఆదాయం



హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిడదవోలు రూరల్: **తిమ్మరాజుపాలెంలో** కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయ హుండీని గురువారం తెరచి ఆదాయం లెక్కించారు. 78 రోజులకు గాను రూ.22,03,839 నగదు, అన్నదాన ట్రస్ట్ హుండీలో రూ.28,085, 31 గ్రాముల బంగారం, 254 గ్రాముల వెండి, ఆరు విదేశీ డాలర్లు లభించాయి. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ వి.హరి సూర్య ప్రకాష్ ఈ విషయం తెలిపారు. దేవదాయ శాఖ తాడేపల్లిగూడెం తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, రేలంగి మారుతి శివభాస్కరరావు, ఉర్ల వీర వెంకటలక్ష్మి, బోనేపల్లి ఉమాదేవి, వద్దిరెడ్డి మహాలక్ష్మి, నిచ్చెనకోళ్ల భవాని, ప్రధానార్చకుడు అప్పారావుశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సైనిక విన్యాసాలు



విన్యాసాల్లో భాగంగా కాకినాడ తీరంలో మోహరించిన యుద్ధ నౌక

కాకినాడ రూరల్: భారత్, అమెరికా సైనిక విన్యాసాలు కాకినాడ తీరంలో కొనసాగుతున్నాయి. మరో రెండు రోజులు పాటు జరగనున్న టైగర్ ట్రయాంఫ్ విన్యాసాల నేపథ్యంలో బీచ్ రోడ్డును పోలీసులు మూసివేశారు. భారత తూర్పు తీర నావికా దళం, ఆర్మీ, ఎయిర్స్ ఫోర్స్‌కు చెందిన సుమారు 700 మంది సైనిక సిబ్బందితో పాటు అమెరికా రక్షణ దళ అధికారులు, సిబ్బంది సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్ ప్రాంతంలోని ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌తో పాటు విశాఖలో ఉభయ చర విన్యాసాలు నిర్వహిస్తున్నారు. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారం, స్నేహపూర్వక వాతావరణం కలిగేలా ఈ విన్యాసాలు చేపట్టారు.

రత్నగిరిపై భక్తుల కిటకిట



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరిపై, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు వారి బంధుమిత్రులతో కలిసి అధిక సంఖ్యలో సత్యదేవుని వ్రతాలాచరించి, స్వామివారిని దర్శించారు. వీరితో పాటు సాధారణ భక్తులు కూడా రావడంతో ఆలయంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. గురువారం కావడంతో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులను నిజరూపంలో దర్శించుకుని భక్తులు పులకించారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని, దర్శించి పూజలు చేశారు. సుమారు రెండు వేల వ్రతాలు జరిగాయి. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రదక్షిణ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో నాలుగు వేల మందికి భోజనం పెట్టారు.

కాకినాడ జిల్లా కలెక్టర్‌గా నివాస్

కాకినాడ సిటీ: జిల్లా కలెక్టర్‌గా జె.నివాస్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీపై జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ కలెక్టర్‌గా పని చేస్తున్న కృతికా శుక్లా ఆరు నెలల ప్రసూతి సెలవుపై వెళ్లారు. జిల్లాల విభజనలో భాగంగా ఆమె 2022 ఏప్రిల్ 4న నూతన కాకినాడ జిల్లా మొట్టమొదటి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దాదాపు రెండేళ్ల పాటు పని చేశారు. వివాదరహితురాలిగా పేరొందారు. జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు.

అనపర్తిలో ఆగ్రహ జ్వాల

- భగ్గుమన్న టీడీపీ శ్రేణులు
- స్పందించని చంద్రబాబు
- పార్టీ శ్రేణుల నిర్ణయం మేరకే ముందుకు వెళ్తానంటున్న నల్లమిల్లి



టీడీపీ ప్రచార కరపత్రాలను దహనం చేస్తున్న పార్టీ శ్రేణులు (అంతర చిత్రం) దగ్ధమవుతున్న కరపత్రాలు

అనపర్తి: నోటి దగ్గర కూడు లాగేసుకుంటే ఎలా ఉంటుంది? చిన్న పిల్లలకు చాక్లెట్ ఇచ్చినట్టే ఇచ్చి తిరిగి తీసేసుకుంటే వారికి ఎంత కోపం వస్తుంది? సరిగ్గా అనపర్తిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పరిస్థితి కూడా అలాగే ఉంది. టీడీపీ విడుదల చేసిన తొలి జాబితాలో అనపర్తి నుంచి రామకృష్ణారెడ్డి పేరు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారం ఆరంభించారు. తదనంతర పరిణామాల్లో టీడీపీ, జనసేనకు బీజేపీతో పొత్తు కుదిరింది. చంద్రబాబు వెళ్లి బీజేపీ నేతలతో బేరసారాలు సాగించడమే కాకుండా.. వారడిగిన స్థాయిలో సీట్లు సమర్పించుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అనపర్తి సీటును బీజేపీకి సమర్పించుకున్నారు. దీంతో తాజాగా ఇక్కడి నుంచి విపక్ష కూటమి అభ్యర్థిగా బీజేపీకి చెందిన ములగపాటి శివరామకృష్ణంరాజు పేరు ప్రకటించారు. కనీసం రామకృష్ణారెడ్డికి మాటమాత్రంగా కూడా ఈ విషయం చెప్పలేదు. ఈ పరిణామాలు అనపర్తి టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. రామకృష్ణారెడ్డికి ఇచ్చినట్టే ఇచ్చి టికెట్టు లాగేసుకోవడంతో వారు భగ్గుమంటున్నారు.

నాలుగు రోజులుగా రచ్చ

వాస్తవానికి అనపర్తి టికెట్టుపై నియోజకవర్గ టీడీపీలో నాలుగు రోజులుగా రచ్చ జరుగుతోంది. ఈ సీటును బీజేపీకి కేటాయిస్తున్నారంటూ వార్తలు రావడంతో కొద్ది రోజులుగా టీడీపీ శ్రేణులు రగిలిపోతున్నారు. దీనిపై అధిష్టానం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకూ ఎన్నికల ప్రచారం చేయవద్దంటూ రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను వారు అడ్డుకున్నారు. తొలిగా బిక్కవోలు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న రామకృష్ణారెడ్డిని ప్రచారం చేయవద్దంటూ నిలిపివేశారు. **ఆయన కుటుంబ సభ్యులు కూడా ప్రచారం చేయకుండా అడ్డుకున్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులకు రాజీనామాలు చేస్తూ సోమవారం రాజమహేంద్రవరంలో ఉన్న టీడీపీ జోన్–2 కోఆర్డినేటర్ రావు వెంకట సుజయ కృష్ణ రంగారావుకు లేఖలు అందజేశారు.** అలాగే మంగళవారం బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో ధర్నా చేశారు. బుధవారం పెదపూడిలో నిరసన చేపట్టారు. అదే రోజు సాయంత్రం బీజేపీ అభ్యర్థిగా శివరామ కృష్ణంరాజు పేరు ప్రకటించడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అదే రోజు రాత్రి ఇద్దరు యువకులు పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించారు. వారిని రామకృష్ణారెడ్డి వారించారు. ఈ క్రమంలో రామవరంలోని ఆయన నివాసానికి టీడీపీ శ్రేణులు గురువారం పెద్ద ఎత్తున చేరుకున్నాయి. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఇప్పటికైనా టీడీపీ అధిష్టానం స్పష్టమైన ప్రకటన **చేసి, రామకృష్ణారెడ్డికే టికెట్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నలభై సంవత్సరాలుగా నియోజకవర్గంలో టీడీపీని మోస్తున్న నల్లమిల్లి కుటుంబానికి చంద్రబాబు అన్యాయం చేశారంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.** కట్టప్ప రాజకీయాలు చేయద్దంటూ చంద్రబాబును తీవ్రంగా దూషించారు. టీడీపీ ఎన్నికల ప్రచార కరపత్రాలు, పార్టీ జెండాలను కుప్పగా పోసి తగులబెట్టారు. వారిని రామకృష్ణారెడ్డి వారించారు. నియోజకవర్గంలో పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి ఇన్నాళ్లూ తాను పడిన కష్టం నిష్ప్రయోజనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తిరిగి ప్రజలు, కార్యకర్తల అభీష్టం మేరకు తగు నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఇంత తంతు జరుగుతున్నప్పటికీ చంద్రబాబు కానీ, ఇతర పెద్దలు కానీ స్పందించకపోవడం ఆ పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

చంద్రబాబు ఇంటి ముందు నిరసన తెలపండి

- సానుభూతి కోసమే కొత్త డ్రామాలు
- అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: టీడీపీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి దిగజారుడు రాజకీయాలు వెన్నతో పెట్టిన విద్య అని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనపర్తి సీటు రామకృష్ణారెడ్డికి టీడీపీ అధిష్టానం కేటాయించకపోతే ఆ పార్టీ శ్రేణులు టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటి ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టాలే తప్ప, రామవరంలో చేస్తే ఉపయోగమేమిటని, ఇది హాస్యాస్పదంగా ఉందని అన్నారు. పొత్తుల్లో భాగంగా అనపర్తి ఎమ్మెల్యే సీటు బీజేపీకి కేటాయించడం ఆయా పార్టీల అంతర్గత వ్యవహారమని, చంద్రబాబు నిర్ణయమని అన్నారు. తనకు టికెట్టు రాకుండా స్థానిక వైఎస్సార్ సీపీ కుట్రలు చేస్తోందని రామకృష్ణారెడ్డి ఆరోపించడం.. ఆడలేక మద్దెల ఓడు సామెతను గుర్తు చేస్తోందని విమర్శించారు. రాజకీయంగా తనకు తగిలే ఎదురుదెబ్బను వైఎస్సార్ సీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి, ఆయన కుటుంబ సభ్యులకు ఆపాదించడం రామకృష్ణారెడ్డికి అలవాటుగా మారిందని దుయ్యబట్టారు. తనకు టికెట్టు రాకుండా వైఎస్సార్ సీపీ నేతలు రూ.20 కోట్లకు బేరసారాలు నడిపారంటూ ఆయన పేర్కొనడం విడ్డూరంగా ఉందని, ఎవరైనా అధిక మొత్తంలో నగదు ముట్టజెపితే అమ్ముడుపోయే స్థితిలో చంద్రబాబు, లోకేష్ ఉన్నారా అని కృష్ణారెడ్డి ప్రశ్నించారు. మూడేళ్ల కిందట బిక్కవోలు లక్ష్మీ గణపతి ఆలయంలో చేసిన అసత్య ప్రమాణం, ఇటీవల అనపర్తి గ్రామ దేవత శ్రీ వీరుళ్లమ్మ అమ్మవారికి సంబంధించి అవహేళనగా మాట్లాడిన ఫలితమే నేడు రామకృష్ణారెడ్డికి పట్టిన దుస్థితి అని చెప్పారు. రానున్న రోజుల్లో ఆయన మరిన్ని కర్మఫలాలు అనుభవించక తప్పదని కృష్ణారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ వారా కుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర రాఘవరెడ్డి కూడా పాల్గొన్నారు.

శేషారావు ఓ శాడిస్టు

- మాజీ ఎమ్మెల్యేపై టీడీపీ నేత కుందుల మండిపాటు
- ఉచిత ఇసుకను అమ్ముకున్నారని ఆరోపణలు
- దుర్గేష్‌కు మద్దతుపై వారం రోజుల్లో నిర్ణయం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కుందుల సత్యనారాయణ

నిడదవోలు: నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు శాడిస్టులా తయారయ్యారని ఆ పార్టీకి చెందిన మరో నేత కుందుల సత్యనారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. టీడీపీ టికెట్ ఆశించి భంగపడి, కొంత కాలం సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయిన ఆయన మళ్లీ ఇటీవల తెర ముందుకు వచ్చారు. తన వర్గ నాయకులు, కార్యకర్తలతో నిడదవోలు మండలం పెండ్యాల గ్రామంలో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే శేషారావుపై పరుష పదజాలంతో విరుచుకుపడ్డారు. శేషారావు వర్గం పచ్చి దొంగలని తీవ్ర స్థాయిలో విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తే దానిని కూడా శేషారావు అమ్ముకున్నారని ఆరోపించారు. అప్పట్లో శేషారావు లారీ ఇసుక రూ.20 వేల చొప్పున వేలాది లారీల ఇసుక అమ్ముకుని, రూ.150 కోట్లు అక్రమంగా సంపాదించి, ఉచిత పథకానికి తూట్లు పొడిచారని అన్నారు. టీడీపీని అన్ని విధాలా భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. ప్రతి ఎన్నికలో శేషారావుకు తాను డబ్బులు ఇచ్చానని, ఆయనకు కృతజ్ఞత లేదని మండిపడ్డారు. 2014, 19 ఎన్నికల్లో కూడా శేషారావుకు తాను డబ్బులు ఇచ్చానన్నారు. జనసేన అభ్యర్థి దుర్గేష్‌ను శేషారావు నెగ్గిస్తారా, ఓడిస్తారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ప్రతి రోజూ టీడీపీ అధిష్టానానికి నిఘా విభాగాల నుంచి నివేదికలు వెళుతున్నాయన్నారు. తాను 20 ఏళ్లు ఇసుక వ్యాపారం చేసి డబ్బులు సంపాదించానని, చిన్న స్థాయి నుంచి కష్టపడుతూ ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. ప్రజా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, శేషారావు మాదిరిగా తాను దొంగను కాదని అన్నారు. నిడదవోలు సీటు తనకు ఇస్తామని చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారని చెప్పారు. అయితే పొత్తు ధర్మంలో భాగంగా తనకు టికెట్ రాలేదని అన్నారు. ఇది చాలా ఇబ్బందికరమైన విషయమని, కార్యకర్తలు అర్థం చేసుకోవాలని కోరారు. దుర్గేష్‌కు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై కార్యకర్తలతో మాట్లాడి, వారం రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని కుందుల చెప్పారు. సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పేరూరి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన వర్జీనియా పొగాకు ధర



గోపాలపురం పొగాకు కేంద్రంలో వేలం నిర్వహిస్తున్న ఆర్ఎం ఆదిశేషయ్య

దేవరపల్లి: వర్జీనియా పొగాకు ధర గురువారం మార్కెట్లో స్వల్పంగా పెరిగింది. గోపాలపురం వేలం కేంద్రంలో కిలోకు రూ.5, దేవరపల్లి, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం–1, 2, కొయ్యలగూడెం వేలం కేంద్రాల్లో ఒక రూపాయి చొప్పున పెరిగింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వారికి కిలోకు సగటు ధర రూ.239.51 లభించింది. ఐదు వేలం కేంద్రాల్లో 1,999 బేళ్లు అమ్మకానికి రాగా 1,377 బేళ్లు కొనుగోలు చేశారు. గోపాలపురం వేలం కేంద్రంలో కిలో గరిష్ట ధర రూ.245 లభించగా, మిగిలిన నాలుగు కేంద్రాల్లో కిలో రూ.241 పలికింది.

ఆశాజనకంగా కొనుగోళ్లు

గోపాలపురం: వర్జీనియా పొగాకు రైతులకు తగిన గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని టుబాకో బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య అన్నారు. గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 282 పొగాకు బేళ్లు వేలానికి వచ్చాయని తెలిపారు. కిలోకు గరిష్టంగా రూ.245, కనిష్టంగా రూ.235 సరాసరిన రూ 239.72 చొప్పున ధర వచ్చిందని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా రైతులు పొగాకు బేళ్లు వేలానికి తరలించాలన్నారు. రెండేళ్లుగా లోగ్రేడ్ పొగాకుకు మంచి ధరలు పలుకుతున్నాయన్నారు. పొగాకు కంపెనీల కొనుగోలుదారులు పోటీ పడటంతో రైతులకు ఆశాజనకంగా ధరలు లభిస్తున్నాయని ఆదిశేషయ్య తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ అధికారి ఐజాక్ దత్తు, రైతులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కోడ్ అమలు



కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ జగదీశ్వరరావును కేసుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐజీ అశోక్ కుమార్. చిత్రంలో ఎస్పీ జగదీష్

- ఆరు జిల్లాల్లో 1,842 నాన్ బెయిలబుల్ వారెంట్లు
- 7,489 కేసులు.. 4,067 మంది అరెస్టు
- రూ.15.53 కోట్ల సొత్తు స్వాధీనం
- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ వెల్లడి

కొవ్వూరు: తమ పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్), మార్గదర్శకాలు పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కొవ్వూరు పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లతో పాటు డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, వీఐపీలు, ముఖ్యమైన ప్రజాప్రతినిధుల జిల్లాల పర్యటన సమయంలో పకడ్బందీ బందోబస్తు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఎన్‌ఫోర్సుమెంట్ అమలును డిసెంబర్ నుంచే ప్రారంభించామన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 1,842 నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశామని తెలిపారు. మద్యం, గంజాయి, నగదు తదితర అంశాలకు సంబంధించి 7,489 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వివరించారు. ఈ కేసులలో 4,067 మందిని అరెస్టు చేసి, రూ.15,53,74,279 సొత్తు స్వాధీనం చేసుకున్నామని అశోక్‌కుమార్ తెలిపారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రభావాన్ని తగ్గించేందుకు దాడులు మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. కొవ్వూరు పోలీసు స్టేషన్లలో రికార్డులను తనిఖీ చేసి, కేసుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. వార్షిక తనిఖీకి వచ్చిన ఐజీ అశోక్ కుమార్ ముందుగా పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ పి.జగదీష్, డీఎస్పీ రామారావు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు వి.జగదీశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో పాఠశాలల నిర్వహణ అద్భుతం

- పాండిచ్చేరి ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్
- లాలాచెరువు స్కూలు, ఆర్ట్స్ కళాశాల సందర్శన



పాఠశాల విద్యార్థులతో పాండిచ్చేరి ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్


కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో పాఠశాలల నిర్వహణ అద్భుతంగా ఉందని కేంద్ర పాలిత ప్రాంతమైన పాండిచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ అన్నారు. లాలాచెరువు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యా విధానం, విద్యార్థుల స్థాయి, తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుతున్న ఆయాలను అభినందించారు. పాఠశాలలో నిర్మించిన ప్రత్యేక లైబ్రరీ రూమును సందర్శించి, దానిని ఏర్పాటు చేసిన నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్‌కు అభినందనలు తెలిపారు. ట్యాబ్‌ల ద్వారా నేర్చుకున్న అంశాలను తొమ్మిదో తరగతి విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి, రాజమహేంద్రవరం డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి ఈవీవీబీఎన్ నారాయణ, ఎస్ఈ పాండురంగారావు, అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు ఎ.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల పరిశీలన

ఆర్ట్స్ కళాశాలలోని వివిధ విభాగాలను కూడా శరత్ చౌహాన్ పరిశీలించారు. తన తాత డాక్టర్ భాగవతుల అప్పారావు ఇదే కళాశాలలో 74 ఏళ్ల క్రితం తత్వశాస్త్ర అధ్యాపకునిగా సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న అర్బన్ కాఫీ సెంటర్, జూట్ బ్యాగ్ స్టార్టప్‌ను తిలకించి, అభినందించారు. ఆర్డీవో చైత్రవర్షిణి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీశైలశాస్త్రి, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ అన్నపూర్ణ, అకడమిక్ సెల్ సమన్వయకర్త డాక్టర్ సంజీవ్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

1న సత్యదేవుని ఆలయ వార్షికోత్సవం

- 13వ సంవత్సరంలోకి నూతనాలయం
- వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు



సత్యదేవుని ఆలయం

అన్నవరం: సత్యదేవుని ఆలయ పునర్నిర్మాణం జరిగి వచ్చే నెల ఒకటో తేదీకి పుష్కర కాలం.. అంటే 12 సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఆలయం 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. 1891 సంవత్సరంలో (ఖర నామ సంవత్సరం) శ్రావణ శుద్ధ విదియ నాడు రత్నగిరిపై సత్యదేవుడు ఆవిర్భవించినట్టు ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. స్వామివారు ఆవిర్భవించి 133 సంవత్సరాలు పూర్తయ్యింది. స్వామివారి పురాతన ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2011లో అప్పటి కార్యనిర్వహణాధికారి కె.రామచంద్ర మోహన్ హయాంలో సత్యదేవుడు, అమ్మవారు, ఈశ్వరుల మూలవిరాట్టులను కదపకుండా.. ఆ మూర్తులకు పకడ్బందీ రక్షణ ఏర్పాట్లు చేసి, నూతన ఆలయాన్ని నిర్మించారు. ఆ ఆలయాన్ని ఫాల్గుణ బహుళ సప్తమి (మార్చి 14, 2012) నాడు అప్పటి కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి స్వామి చేతుల మీదుగా కలశ స్థాపన చేసి ప్రారంభించారు. అప్పటి నుంచీ తెలుగు తిథుల ప్రకారం ఫాల్గుణ బహుళ సప్తమి నాడు నూతన ఆలయ కలశ ప్రతిష్ఠ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. అదే సందర్భంగా వచ్చే నెల ఒకటో తేదీన ఈ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రస్తుతం కూడా ఆలయ ఈఓగా రామచంద్ర మోహనే ఉండటం విశేషం. ఆ రోజు తెల్లవారుజామున సత్యదేవుడు, అమ్మవారికి, శంకరులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. స్వామివారికి బూరెలు, పులిహోర, రవ్వకేసరి ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేస్తారు. స్వామివారి గోధుమనూక ప్రసాదం కూడా పంపిణీ చేస్తారు.

క్లుప్తంగా

కోడ్‌కు లోబడి 'స్థాయీ' సమావేశాలు



కాకినాడ సిటీ: జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన గురువారం జెడ్పీ సమావేశపు మందిరంలో 1, 2, 4, 7 స్థాయి సంఘాల సమావేశాలు జరిగాయి. 3వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన, 5వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి అధ్యక్షతన జరిగాయి. 6వ స్థాయీ సంఘ సమావేశం జెడ్పీ వైస్ చైర్పన్ మేరుగు పద్మలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాల్లో జెడ్పీటీసీ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఏ విధమైన శాఖపరమైన సమీక్షలుగానీ, తీర్మానాలుగానీ ఆమోదించకుండా స్థాయీ సంఘ సమావేశాలు ముగిశాయి. జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, ఆయా జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా ప్రజాపరిషత్ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పాట్‌కు సర్వం సిద్ధం

- ఒకటి నుంచి 8 వరకు టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనం
- జిల్లాకు 1.85 లక్షల సమాధాన పత్రాలు కేటాయించే అవకాశం
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం



పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించే అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల

రాయవరం: పదవ తరగతి పరీక్షలు ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ఈ నెల 18వ తేదీ నుంచి 112 పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే. 21,113 మంది విద్యార్థులు రెగ్యులర్, ప్రైవేట్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా, సరాసరిన 99.48 శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇప్పుడు అధికారులు జవాబు పత్రాల మూల్యాంకనంపై దృష్టి సారించారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా కేంద్రమైన అమలాపురంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పాట్ వేల్యుయేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ 19న ప్రారంభమైన స్పాట్ వేల్యుయేషన్ 26వ తేదీ వరకు ఆరు రోజుల పాటు నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే జవాబు పత్రాల మూల్యంకనాన్ని అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలతో పాటుగా, బాలికల ఉన్నత పాఠశాలలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష పేపర్ల కోడింగ్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటలకు జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టనున్నారు.

దఫదఫాలుగా జవాబు పత్రాలు

ఈ ఏడాది వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1.85 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే అవకాశముంది. మూల్యాంకన ప్రక్రియను సమర్థంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు తలమునకలయ్యారు. ఇప్పటికే పూర్తయిన పది పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలు వివిధ జిల్లాల నుంచి దఫదఫాలుగా వస్తున్నాయి. ఇప్పటి వరకు తెలుగు, కాంపోజిట్ తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, పీఎస్ సబ్జెక్టులకు సంబంధించిన జవాబు పత్రాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. బయాలాజికల్ సైన్స్, సోషల్, ఒకేషనల్, ఓఎస్ఎస్ సబ్జెక్టులకు చెందిన జవాబు పత్రాలు రావాల్సి ఉంది. ఆయా జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారి క్యాంప్ ఆఫీసర్‌గా, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. వీరితోపాటు అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొననున్నారు. గతేడాది 1,84,083 జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టారు. తెలుగు 25,168, కాంపోజిట్ తెలుగు-3,457, సంస్కృతం-2,163, హిందీ 29,058, ఇంగ్లిషు-24,209, గణితం-24,017, పీఎస్-24,781, బయాలజీ-24,781, సోషల్-26,307, వొకేషనల్ 142 పేపర్లను జిల్లాకు కేటాయించారు. ఈ ఏడాది కూడా అంతే స్థాయిలో జిల్లాకు కేటాయించే అవకాశముంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు	:	01
స్ట్రాంగ్ రూమ్ ఇన్‌చార్జి	:	01
అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు	:	07
ఏఏసీవోలు	:	07
చీఫ్ ఎగ్జామినర్లు	:	99
అసిస్టెంట్ ఎగ్జామినర్లు	:	594
స్పెషల్ అసిస్టెంట్లు	:	198

సబ్జెక్టుల వారీగా..

పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకన విధులకు ఆయా సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమిస్తూ ఇప్పటికే ఉత్తర్వులను సిద్ధం చేసే పనిలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఉంది. స్పాట్ వేల్యుయేషన్ ఉత్తర్వులను సంబంధిత ఉపాధ్యాయులకు ఒకటి రెండు రోజుల్లో అందజేయనున్నట్లు సమాచారం. ఏడు సబ్జెక్టులు, ఒకేషనల్ పరీక్షలు కలిపి మొత్తం ఎనిమిది రోజులు పాటు మూల్యాంకనం చేస్తారు.

నిబంధనలు..

మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్లు, వైట్నర్, ఎరేజర్ తదితర వస్తువులను మూల్యాంకనం గదిలోకి తీసుకువెళ్ల రాదు. ప్రతి రోజు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మూల్యాంకనం జరుగుతుంది. మూల్యాంకన సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎటువంటి తప్పిదాలు జరిగినా బాధ్యత వహించాల్సి ఉంటుంది. శిబిరానికి నిర్దేశిత సమయాల్లో హాజరు కాకుంటే, అటువంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

కోడింగ్ చేస్తున్నాం



ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికి చేరుకున్న జవాబు పత్రాలను కోడింగ్ చేస్తున్నాం. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం స్పాట్ వేల్యుయేషన్‌కు నియమ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేస్తున్నాం.
– నక్కా సురేష్, అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

అసౌకర్యం కలగకుండా..



ఇన్విజిలేటర్లకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నాం. జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. నిర్ణీత సమయంలో మూల్యాంకనం పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం.
– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ఎవరికీ మినహాయింపులు ఉండవు



మూల్యాంకన విధులకు నియమితులైన వారు తప్పనిసరిగా విధులకు హాజరు కావాల్సి ఉంది. స్పాట్ వేల్యుయేషన్‌లో ఎవరికీ మినహాయింపులు ఉండవు. సకాలంలో మూల్యాంకనం జరిగేలా ఉపాధ్యాయులు సహకరించాలి.
– జి.నాగమణి, రీజనల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు శశికళ



అమలాపురం రూరల్: ఇందుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి ఉందుర్తి శశికళ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయింది. కాకినాడ వాకలపూడిలో జరిగిన ఎంపికల్లో 65 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచింది. ఈ నెల 30, 31వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ అండర్- 17 పోటీలకు విభాగానికి ఎంపికైనట్లు హెచ్ఎం విత్తనాల శ్రీనివాసరావు, పీఈటీ బుజ్జి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన శశికళను సర్పంచ్ చొల్లంగి శివాని, ఎస్ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

మండల పరిషత్ కార్యాలయంలో చోరీ

మానిటర్ దొంగిలించుకుపోయిన వైనం

గండేపల్లి: జాతీయ రహదారి, పోలీస్ స్టేషన్‌కు అతి సమీపంలో గల మండల పరిషత్ కార్యాలయంలో చోరీ సంఘటన చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు కార్యాలయం మెయిన్ ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన గుర్తుతెలియని చోరులు ఈఓఆర్డీ, రికార్డ్స్, ఎండీఓ, ఇతర గదుల తాళాలు పగులగొట్టి, గెడలు వంచి లోపలికి ప్రవేశించారు. అక్కడ ఏమి లేకపోవడంతో వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన మానిటర్‌ను దొంగిలించుకుపోయినట్టు తెలిపారు. సోమవారం ఉదయం అటెండర్ విధులకు వచ్చేసరికి కార్యాలయం మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి ఉండటంతో ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. కార్యాలయం వద్దకు చేరుకున్న ఏఓ చంద్రరావు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. చోరీకి గురైన మానిటర్ విలువ రూ.50,000 ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా అదే రోజు జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలోను గుర్తుతెలియని చోరులు కార్యాలయ తాళాలు పగులగొట్టారని, ఎటువంటి వస్తువులు చోరీకి గురికాలేదని తెలిసింది.

సాంకేతిక లోపంతో నిలిచిన షాలిమార్ ఎక్స్‌ప్రెస్

- ఐదున్నర గంటల ఆలస్యం
- రెండు గంటల పాటు ఆగిన ఈస్ట్‌కోస్ట్
- ఆందోళనకు దిగిన ప్రయాణికులు



నిలిచిపోయిన షాలీమార్ ఎక్స్‌ప్రెస్



స్టేషన్ మాస్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో రెండు రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు స్టేషన్ మాస్టర్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. గురువారం ఉదయం 5 గంటలకు రావాల్సిన షాలిమార్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (22849) రెండున్నరగంటలు ఆలస్యంగా 7.35 గంటలకు చేరుకుంది. రైలు బయలుదేరినప్పటినుంచి జనరేటర్‌లో లోపాలు తలెత్తడంతో ముందుకు వెళ్లలేక స్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై నిలిచిపోయింది. అదే సమయంలో ఉదయం 7.45 గంటలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు చేరుకోవాల్సిన ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) రెండు గంటలు ఆలస్యంగా 10 గంటల సమయంలో చేరుకుంది. షాలీమార్ ఎక్స్‌ప్రెస్‌లో తలెత్తిన సాంకేతిక లోపం సరిదిద్దేందుకు ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను మొదటి ప్లాట్‌ఫారంపై నిలిపివేశారు. సుమారు రెండుగంటల పాటు ప్రయత్నించినా ఏ విధమైన ప్రయోజనం లేకపోకపోవడంతో ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను 11.55 గంటల సమయంలో పంపించివేశారు. షాలిమార్ ఎక్స్‌ప్రెస్ మరమ్మతులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో స్టేషన్ మాస్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రైల్వే శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఐదున్నర గంటల తరువాత ఒంటి గంట సమయంలో షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌కు రెండు ఇంజిన్‌లను అమర్చి సికింద్రాబాద్ పంపించారు. స్టేషన్‌లో జీఆర్పీ,ఆర్పీఎస్ సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు.

ఇప్పటి వరకు రూ.15 లక్షల సీజ్

- తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీష్
- గోకవరంలో చెక్‌పోస్టుల తనిఖీ



గోకవరంలో సీఐ నాగమురళి, ఎస్సై నాగరాజుకి సూచనలిస్తున్న ఎస్పీ జగదీష్

గోకవరం: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ చెక్‌పోస్టుల ద్వారా రూ.15 లక్షల వరకు నగదును సీజ్ చేసినట్టు జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. గోకవరంలో రంపచోడవరం వెళ్లే మార్గంలోని చెక్‌పోస్టును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. రంపచోడవరం నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు అదనంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా పలు ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. వివిధ పనుల నిమిత్తం ప్రజలు రూ.50 వేల వరకు వెంట తీసుకు వెళ్లవచ్చన్నారు. అంతకుమించి ఎక్కువ నగదు పట్టుకెళ్లినప్పుడు పట్టుబడితే సంబంధిత పత్రాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ దృష్టికి తీసుకువెళితే పరిశీలించి 24 గంటల్లో విడుదల చేస్తామన్నారు. రూ.10 లక్షలకు మించి నగదు పట్టుకెళితే ఇన్‌కం ట్యాక్స్ అధికారులు పరిశీలించి విడుదల చేస్తారన్నారు. ఆయన వెంట కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, ఎస్సై కె.నాగరాజు ఉన్నారు.

నెట్టింట బిక్కవోలు లక్ష్మీగణపతి

అనపర్తి: చెవిలో చెప్పగానే భక్తులు కోరిన కోర్కెలు తీర్చే దైవంగా అనపర్తి నియోజకవర్గంలోని బిక్కవోలు గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీలక్ష్మీ గణపత్తి ప్రసిద్ధికెక్కారు. ఎన్నికల సమయం వచ్చిందంటే చాలు... జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అనేకమంది అభ్యర్థులు, ఆశావహులు ఈ స్వామిని దర్శించి తమ కోర్కెలు విన్నవించుకోవడం పరిపాటి. అయినే 2024 సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం కాకముందే లక్ష్మీ గణపతి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. బుధవారం రాత్రి బీజేపీ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే తమ అభ్యర్థుల జాబితాను ప్రకటిచగానే స్వామి వారు ఒక్కసారిగా మళ్లీ సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. సుమారు రెండు సంవత్సరాల క్రితం ప్రస్తుత అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిల మధ్య చోటు చేసుకున్న అవినీతి ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో వీరిరువురూ బిక్కవోలు లక్ష్మీగణపతి సమక్షంలో చేసుకున్న సత్య ప్రమాణాలు అప్పట్లో వార్తల్లోకి ఎక్కాయి. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి టీడీపీ విడుదల చేసిన మొదటి జాబితాలో నల్లమిల్లి పేరు ప్రకటించి కూడా చివరకు టికెట్ హుష్‌కాకి కావడంతో అప్పట్లో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామి సమక్షంలో చేసిన (అ)సత్య ప్రమాణం ఫలితమే ఇదని, లక్ష్మీ గణపతి మహిమే అంటూ నెట్టింట జోరుగా పోస్టులు వెలిశాయి. దేవుడు ఉన్నాడని మరోసారి రుజువైందని పోస్టులు, కామెంట్లతో సోషల్ మీడియాలో హోరెత్తించారు.

భార్య దాడితో భర్త మృతి

ఘర్షణలో కుమారుడికి గాయాలు



మృతుడు వెంకట్ (ఫైల్)



చికిత్స పొందుతున్న కృష్ణవంశీ

ఉండ్రాజవరం: భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త మృత్యువాత పడగా, కుమారుడు కత్తిపోటు గాయానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెంకు చెందిన గుల్లంకి వెంకట్(44)కు, ఉండ్రాజవరం గ్రామానికి చెందిన పార్వతికి 20 ఏళ్ల క్రితం వివాహం కాగా, వారికి కొడుకు, కూతురు ఉన్నారు. అయితే పది ఏళ్లుగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. వెంకట్ తన స్వగ్రామం తాడేపల్లిగూడెంలో ఉంటుండగా, పార్వతి తన ఇద్దరూ పిల్లలతో ఉండ్రాజవరంలో జీవనం సాగిస్తున్నారు. వెంకట్ అప్పుడప్పుడూ వచ్చి పార్వతిని తనతో వచ్చేయమని గొడవ పడుతుండేవాడు. ఇటీవల కుమార్తె పెళ్లి కారణంగా వచ్చిన వెంకట్ పది రోజులు నుంచి ఉండ్రాజవరంలోనే ఉంటున్నాడు. బుధవారం రాత్రి పార్వతి తనతో వచ్చేయాలంటూ మళ్లీ గొడవకు దిగాడు. దాంతో భార్య పార్వతి, కొడుకు కృష్ణవంశీతో తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కృష్ణవంశీని వెంకట్ కత్తితో పొడిచాడు. కొడుకు కత్తిపోటుకు గురికావడంతో చలించిన పార్వతి ఒక్కసారిగా భర్తపై ఇటుకతో దాడికి పాల్పడింది. వెంకట్ దాడిని ప్రతిఘటించే క్రమంలో తల్లీ కొడుకు ఇద్దరూ కలసి ఇటుకలతో వెంకట్ తలపై కొట్టడంతో వెంకట్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తేరుకున్న పార్వతి గాయ పడిన భర్త, కొడుకును తణుకు ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా వెంకట్ పరిస్థితి విషమంగా ఉండటంతో తణుకు నుంచి ఏలూరు, అక్కడ నుంచి విజయవాడకు తరలించారు. గురువారం తెల్లవారుజామున వెంకట్ ఆసుపత్రిలో మృతి చెందాడు. కొడుకు కృష్ణవంశీ ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉండ్రాజవరం ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేయగా, నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో హత్య

వివాహేతర సంబంధమే కారణం!



రక్తపు మడుగులో భాస్కరరావు మృతదేహం

రాజమహేంద్రవరం రూరల్: మద్యం మత్తులో ఒక వ్యక్తిని కత్తితో దాడిచేసి హత్య చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి కవలగొయ్యి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కవలగొయ్యి గ్రామానికి చెందిన పలుకూరి భాస్కరరావు (35) తొట్టి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. 12 ఏళ్ల క్రితం భార్యతో మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకున్నారు. భాస్కరరావు ఇంటికి దగ్గరలో ఉన్న ఒక మహిళతో మూడున్నరేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. ఒక నెల నుంచి ఆమె భాస్కరరావును ఇంటికి రావద్దని చెప్పింది. అయినా ఆమె ఇంటికి వెళ్లడం మానకపోవడంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. భాస్కరరావుకు కవలగొయ్యి గ్రామానికి చెందిన కె.నారాయణమూర్తితో పరిచయం ఏర్పడి ఇద్దరూ కలిసి తిరుగుతుండేవారు. నారాయణమూర్తి రెండు నెలల నుంచి భాస్కరరావు సహజీవనం చేస్తున్న మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. నారాయణమూర్తి బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో భాస్కరరావు ఇంటికి వెళ్లి అతనిని స్కూటీ మీద మందు తాగటానికి ఎక్కించుకుని వెళ్లాడు. ఆ ఇద్దరు లక్ష్మీనగర్‌లో నారాయణమూర్తి పొలం దగ్గర లే అవుట్‌లో వాచ్‌మెన్ నివాసం ఉండే తాటాకుపాక వద్ద మద్యం తాగారు. 12.30 గంటల సమయంలో కత్తితో నారాయణమూర్తి భాస్కరరావు తలపై, దవడ భాగంలో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. భాస్కరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఇది చూసిన వాచ్‌మన్ తాతారావు అక్కడ నుంచి పారిపోయాడు. గురువారం ఉదయం తాతారావు భాస్కరరావు తల్లి సరోజినికి జరిగిన విషయాన్ని తెలిపాడు. దీంతో ఆమె ఘటనా స్థలానికి వెళ్లగా అక్కడ భాస్కరరావు రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడు. సరోజిని ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'నన్నయ' విద్యార్థికి గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన పవన్‌కుమార్‌ని అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ చాంపియన్ షిప్ 2023-24లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి గోల్డ్ మెడల్ సాధించాడని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో గత నెల నిర్వహించిన ఈ పోటీలలో 95 కిలోల కేటగిరిలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో ఒకటైన కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థి కోడూరి పవన్‌కుమార్ ఈ ఘనతను సాధించాడన్నారు. ఇదే స్ఫూర్తితో మరెన్నో విజయాలు అందుకోవాలనే ఆకాంక్షను వెలిబుచ్చుతూ, గురువారం ఆ విద్యార్థిని అభినందించారు. యూనివర్సిటీ ద్వారా రూ.30 వేల బహుమతిని అందజేశారు. స్పోర్ట్స్ కోటాలో రైల్వేలు ఉద్యోగం పొందాలనేదే తన లక్ష్యమని తెలిపాడు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ బి.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి కాంట్రాక్టర్ మృతి

తుని: తుని జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుల్లిపాడు- నర్సీపట్నం స్టేషన్ల మధ్యలో రైలు నుంచి జారిపడి సంబంగి శ్రీనివాసరావు(45) మృతి చెందాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. గురువారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఏపీ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి శ్రీనివాసరావు (వాసు) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శ్రీనివాసరావు కాంట్రాక్టర్. వివాహం అయిన ఈయన కుమార్తె విశాఖపట్నంలో ఉంటున్నారు. కుమార్తెను చూసి తిరిగి వెళ్లేందుకు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

గుడ్ ఫ్రైడే

క్రీస్తు విధేయతా బలియాగం



క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానాల వెనుక దేవుని దివ్య సంకల్పం ఉంది. దీన్నే సువార్త అంటారు. సువార్త దేవుని సంకల్పంతో ఎప్పుడూ ముడిపడే ఉంటుంది. పూర్వపు దేవుని సంకల్పం చెప్పక దాన్ని దాటవేసే సువార్త అసలు లెస్సయైన లేఖనానుసార సువార్తగా ఎప్పటికీ కానేరదు. సువార్త పుట్టుకకు ఆయువుపట్టు వంటి దేవుని ప్రణాళికను చాలా పకడ్బందీగా, పటిష్ఠంగా వివరించకున్ననూ అది సువార్త కాదు. సత్యవాక్యం అనే రక్షణ భాగ్యపు సువార్త ప్రకటన అపొస్తలుల బోధకు లోబడే ఉండి తీరాలి.

వారపు ప్రప్రథమ దినం అనే ప్రతి ఆదివారం నాడు యెడతెగక దేవుని ఆరాధనలో భాగంగా జరిగే రొట్టె విరుచుట అనేది క్రీస్తు బలియాగానికి గుర్తు. క్రీస్తు పస్కా బలి పశువుగా, వధకు సిద్ధమైన గొఱ్ఱెపిల్లగా అనాదిలోనే దేవుని చేత నిర్ణయించబడినవాడు. అది క్రీస్తు మరణంతో నెరవేరుటను నేడు మనం చూస్తున్నాం. క్రీస్తు వారి నలగగొట్టబడిన శరీరానికి గుర్తుగా రొట్టెను, మానవాళి కొరకు చిందించబడిన పవిత్ర రక్తానికి గుర్తుగా ద్రాక్షరసాన్ని... ఇలా రెండింటిని కృతజ్ఞతాపూర్వక ప్రార్థనలతో తీసుకుంటూ ప్రభువు వచ్చువరకు ఇలా చేస్తూ క్రీస్తు సిలువ యాగాన్ని గుర్తుకు తెచ్చుకుంటుంది క్రీస్తు ప్రభువు వారి సంఘం. నిజానికి ఇది భోజనం, పానం కాదు. నీతి, సమాధానం, పరిశుద్ధాత్మ సంబంధిత ఆత్మానందం ఇహమందు కాక ఈ లోక సంబంధులుగా కాక పరలోక సంబంధులుగా సంఘమనే దేవుని రాజ్యంలో జరుపుకొనే పండుగ. సంఘ భవనంలోనే ఇది జరిగినా కూడ సత్య లేఖనాల సారం ప్రకారంగా ఇది ఇహమందు అద్వితీయ సత్యదేవుడు, ఆయన నియమించిన రాజు ప్రధాన యాజకుడైన క్రీస్తు వారి సమక్షంలో జరిగే అత్యున్నత సంఘ కార్యక్రమం. సంఘం అంటే పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారని అర్థం. ఇట్టి ఆదివారపు దేవుని ఆరాధనతో సంఘం పరిశుద్ధంగా, ఆత్మ సంబంధంగా అన్నింటా బలపడుతూ ఉంటుంది.



ఈ జగత్తుకు పునాది వేయక పూర్వమే దేవుని ఆలోచనలలో ఉన్న క్రీస్తు బలియాగం అనే 'పథక రచన' గూర్చి ఎంతగా చెప్పుకొన్నా, అది తక్కువే. తన ప్రజల పాప పరిహారార్థం అద్వితీయ జ్ఞానసంపన్నుడైన దేవుడు అనాదిలోనే క్రీస్తు పరిశుద్ధ రక్తానికి రూపకల్పన చేయడం జరిగింది. అప్పటికి ఇంకా మానవ సృష్టి జరగలేదు. భూలోకమే లేదు. భూమి మీద మనుష్యుల జాడే లేదు. పాపమే లేదు. దీన్నే క్రీస్తు కేంద్రంగా చేయబడిన దేవుని నిత్య సంకల్పంగా చెబుతారు. క్రీస్తు లేకుంటే దేవునికి సంకల్పమే లేదు అనేంత ఉన్నతం గా దీన్ని గూర్చి చెప్పుకోవడం మాత్రం అసాధారణం. తండ్రియైన యెహోవా దేవుడు తన నీతిని బట్టి సంతోషం గలవాడై ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమం సంబంధిత సంకల్పాన్ని మించిన భావజాలం లేదా భావ సంపద మరొకటి లేదంటారు.

దేవుని దృష్టి కోణంలో దేవుని మనస్సుతో దేవుని గ్రంథాన్ని లోతుగా అధ్యయనం చేసే వారికి ఒక విషయం తేటగా అర్థం అవుతుంది. అదేమిటంటే, దేవుడు అన్యాయం చేయుట అసంభవం అనునదే. ఈ సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకొన్నవారే ఆత్మ సంబంధులు. బలిని కాక కనికరమునే కోరే దేవుడు ప్రారంభంలో జంతుబలులను ఏర్పాటు చేసినా కూడా యుక్త కాలాన తన సొంత కుమారుడను బలిగా అర్పించుట ద్వారా ఇలా పాపవ్యాప్తి నివారణకు మేలైన శాశ్వత పరిష్కారం కనుగొని జంతు బలులకు చరమగీతం పలికాడు. యూదులకు చాలా సహజంగా సామాన్యంగా చెప్పే సత్యం ఒకటుంది. రక్తం చిందింపకుండా పాప క్షమాపణ కలుగదు. ఇది నమ్మే యూదులు మెస్సీయ బలిని కనులారా చూడటం ద్వారా విస్మయానికి గురయ్యారు. మహాదేవుని సంకల్పానికి బహు ముగ్ధులై ఐశ్వర్య భయంతో వినయ సంపన్నులైన వారంతా తలలు వంచి దేవుని పాదాల చెంత సాగిలపడ్డారు. మానవాళి అంతా పుట్టారు కాబట్టి చనిపోతారు. యేసుక్రీస్తు మరణించడానికే పుట్టాడంటూ పండిత పెద్దలు పదే పదే చెబుతుంటారు. ఇదే ఆయన జీవితం ప్రత్యేకత. ఇలాంటి జీవితం ఈ భూమి మీద ఏ ఒక్కరికీ

ఒకనాడు దేవుడు ఆజ్ఞాపించి చేయమన్న ఇహలోక భూ భౌతిక సంబంధ పండుగల కంటె మిన్నగా ఆత్మ సంబంధ పండుగను ఒకటి నిర్ణయించి నేడు ఉన్నతంగా ఆచరించమని తన గ్రంథం ద్వారా ఆజ్ఞాపిస్తున్నాడు. అదే క్రీస్తు పస్కా పండుగ. ఇది హృదయానందానికి సంబంధించినది. ఇది ఎక్కడా ప్రసిద్ధి చెందినట్టుగా బహు ప్రాచుర్యంలో ఉన్నట్టుగా లోకంలో కనబడదు. క్రీస్తు పస్కా పండుగ ఒకటి ఉందనేది లోకానికి తెలియదు. ఎందుకంటే ఇది ఆత్మసంబంధమైనది. దేవుని రాజ్యం దానిని పొందిన వారి అంతరంగానికి మాత్రమే అందే కార్యం. ఇది తన తోటి వారికి, పక్కవారికి, అన్యులకు ఏనాడూ అంతు చిక్కని కార్యం. ఇది జీవం గల దేవుని సంఘంలో క్రీస్తును బట్టి క్రీస్తు ద్వారా క్రీస్తునందు జరిగే ఉన్నతమైన కార్యక్రమం.

లేదన్నదే సుసమాచారం. క్రీస్తు ఈ లోకానికి చెప్పశక్యం కాని ఒక వరంగాను ఆయన సాహసోపేత విధేయత తాలూకు ప్రాణత్యాగం మానవాళి పాలిట శుభవార్తగానూ చరిత్రకెక్కిందనేది గమనార్హం. బాల్యం నుండే కాక, మూడున్నర సంవత్సరాల తన యౌవన కాలమంతా దేవునికి వెచ్చించి విధేయుడైన వాడై తన్ను తాను దేవునికి అర్పణగా సమర్పించుకున్నాడు. 'నీ చిత్తమే సిద్ధించును గాక!' అంటూ మరణానికి ఎదురుగా వెళ్ళిన అరుదైన జీవితం క్రీస్తు ప్రభువుది.

లోక పాపాలను మోసుకొనిపోయే దేవుని గొఱ్ఱె పిల్లగా, పస్కా బలి పశువుగా క్రీస్తును అభివర్ణిస్తుంది పరిశుద్ధ బైబిలు. దేవునికి అవిధేయులైన మానవాళి పాపాలు గొఱ్ఱె పిల్లపై మోపబడ్డాయి. ఫలితంగా గొఱ్ఱెపిల్ల మరణించింది. క్రీస్తుకు ఇందుకొరకే శరీరం ఇవ్వబడింది లేదా అమర్చబడింది. దేవుని ప్రజల పాపాలకు ప్రతిగా వారి పక్షాన సిలువలో క్రీస్తు శరీరాన్ని శిక్షకు గురి చేయడం ద్వారా దేవుని ప్రజలు తమ తమ పాపాల నుండి విమోచించబడి పరిశుద్ధులయ్యారు. క్రీస్తు మరణం వెనుక దాగిన సువిశేష పరమార్థం ఇదే. మానవ ప్రారంభ ఆదాము అనే ఒకని అవిధేయత ద్వారా లోకంలోనికి పాపం ప్రవేశించింది. కడపటి ఆదాము అనే ఒకని విధేయత ద్వారా యావత్తూ అవిధేయ మానవాళికి రక్షణ భాగ్యం సంప్రాప్తించింది. వారంతా కొత్త జన్మతో నూతన సృష్టిగా పరివర్తన చెందారు. ఆ కడపటి ఆదామనే క్రీస్తు సాహసోపేత జీవిత విధానమే ఎల్లరకు పరిశుద్ధ జీవితాలను అనుగ్రహించింది.

ఈ దిగువ గల యెషయా భవిష్యత్ ప్రవచనం దాని వర్ణన అత్యున్నతమైన క్రీస్తు విధేయత జీవిత సారాన్ని అసాధారణ రీతిలో వెల్లడి చేయుట అనేది మనస్సు పెట్టి గమనించదగ్గది. బలి యాగంలో క్రీస్తు చూపిన విధేయత ఇప్పటికీ వేనోళ్ళ కొనియాడబడుతునే ఉండుట బహు ఆశ్చర్యకరం! ఈ ప్రవచనం క్రీస్తు నందు నెరవేరింది.

"అతడు దౌర్జన్యము నొందెను
బాధింపబడినను అతడు నోరు తెరువలేదు
వధకు తేబడు గొఱ్ఱె పిల్లయు
బొచ్చు కత్తిరించు వాని యెదుట గొఱ్ఱెయు
మౌనముగా నుండునట్లు
అతడు నోరు తెరువ లేదు
అన్యాయపు తీర్పు నొందిన వాడై
అతడు కొనిపోబడెను
అతడు నా జనుల యతిక్రమమును బట్టి
మొత్తబడెను గదా"

ఈ అరుదైన సృష్టిలో, బిడ్డను నవ మాసాలు మోసిన కన్న తల్లి అతన్ని భూమి మీద విడిచి పెట్టి కన్ను మూసింది. అతడు పెద్దవాడై తన తల్లి పట్ల నిత్యమూ కృతజ్ఞతాభావం కలిగిన వాడై ఆమె ఆలోచనలు, ఆశయాలు అన్వేషిస్తూ వాటి సాధనలో నిత్యమూ నిమగ్నమవడమే కాకుండా, తన తల్లి వలె ఏ ఒక్కరూ రక్త హీనతతో చనిపోకుండా పుష్టినిస్తూ బలవృద్ధి కలుగజేసే బహు మేలైన ఉచిత సేంద్రీయ సహజాహార పంపిణీకి దృఢ సంకల్పంతో నడుం కట్టాడు. తన తల్లి మరణాన్ని ఒక పండుగగా, వేడుకగా మలిచే పనిలో సత్క్రియల యందాసక్తితో అతడు సమాజంతో ప్రేమలో పడ్డాడు. 'ఆమె మరణించి మనకు దూరం కాలేదు. ఇదిగో ఇక్కడే ఉంది నవ్వుతూ అన్న భావనను కుటుంబంలోను, బంధు మిత్రులలోనూ ఆమె కొడుకు కలుగజేసిన వైనం అతనిదైన సృజనాత్మక కళాత్మక పనితనమనే చెప్పాలి. అది చూసి ఊరు ఊరంతా ఆ మహాతల్లి త్యాగం వూరికే పోతుందా అనే వారే అంతటా. తన మాతృమూర్తి ప్రేమను అతడు సెలబ్రేట్ చేయబూనే వైవిధ్య విధానానికి తెరలేపడం వలన అంతా మంత్ర ముగ్ధులయ్యేలా అది ఊరంతా పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమ్మ అజెండా సాధనే ధ్యేయంగా పిల్లవాడి ప్రయాసకు అంతా జత కలిశారు.


యేసు ప్రాణ త్యాగం అచ్చు ఇలాంటిదే. సెలబ్రేట్! జీసస్ సెలబ్రేట్!

– జేతమ్

● ముత్తు నందిని ప్యాలెస్


ఇష్టాల ఇల్లు

రాజ్ చందర్ పద్మనాభన్, నాగ జయలక్ష్మి దంపతులు తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారిలో నివసించేవారు. సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమంలో వీరు అనుసరించిన విధానం ఇప్పుడు దేశమంతటినీ ఆకర్షిస్తోంది. పర్యావరణ ప్రేమికులనైతే మరీ ఎక్కువగా ఆకట్టుకుంటోంది. రెండేళ్ల కిందట గృహప్రవేశం చేసుకున్న కొత్త ఇల్లది. అయితే ఆ ఇంట్లో అడుగుపెడితే కాలం గిర్రున సినిమా రీల్‌లాగ వందేళ్ల వెనక్కి తిరిగిపోయిందా అనిపిస్తుంది. ఇంటిని చూడడానికి వచ్చిన వాళ్లను అతిథి మర్యాదలతో ముంచెత్తుతారు ఈ దంపతులు. సేంద్రియ పద్ధతిలో పండించిన దినుసులు, కాయగూరలతో సంప్రదాయ తమిళ, చెట్టినాడు వంటలను వడ్డిస్తారు.





నాగ జయలక్ష్మి, రాజ్ చందర్ పద్మనాభన్



పర్యావరణహిత భవనం ముత్తు నందిని ప్యాలెస్



ఎర్రమట్టి, సున్నపు రాయితో నిర్మించిన ఇంట్లో భూగర్భ జలాలను పరిరక్షించే ఏర్పాటు ఉంది. బంకమట్టి నిర్మాణం కావడంతో ఎండాకాలం చల్లగా ఉంటుంది. నేచర్ ఫ్రెండ్లీ ట్రావెల్‌ను ఇష్టపడే వాళ్లు ఇక్కడ బస చేస్తుంటారు. బస చేయకపోయినా చూసి పోవడానికి వచ్చేవాళ్లు కూడా ఎక్కువగానే ఉంటారు. ఈ కాలంలో ఇంటిని ఇలా ఎందుకు కట్టుకున్నారనే ప్రశ్న దాదాపుగా ప్రతి ఒక్కరి నుంచి ఎదురవుతుంటుంది. జయలక్ష్మి ప్రతి ఒక్కరికీ పూసగుచ్చినట్లు వివరిస్తుంటుంది.

బాల్యంలోకి వెళ్లారాయన!

"రాజ్‌చందర్ వృత్తిరీత్యా జియో డాటా అనలిస్ట్. ఆయనకు ఇష్టమైన రోజులంటే చిన్నప్పుడు వాళ్ల అమ్మమ్మ గారింట్లో గడిపిన బాల్యమే. పైగా రాజ్ అభిరుచి, విధి నిర్వహణ కూడా పర్యావరణవేత్తలతో కలిసి పని చేయడమే. ఈ రెండు ఇష్టాలను కలుపుతూ చక్కటి ఇల్లు కట్టుకోవాలని ఎప్పుడూ చెప్పేవారు. నాక్కూడా మా సంప్రదాయ నిర్మాణంలో ఉండే సౌందర్యం చాలా ఇష్టం. ఇద్దరి అభిరుచులూ కలవడంతో ఇంటిని ఇలా కట్టుకున్నాం. మా ఇద్దరి ఇష్టాల మేరకు ఎలా కట్టుకోవాలో ఒక ఐడియా వచ్చేసింది. ఎక్కడ కట్టాలనే విషయంలో ఒక అభిప్రాయానికి రావడం కొంచెం కష్టమే అయింది. లొకేషన్ సెర్చింగ్ మొదలు పెట్టాం.

సంజీవని శకలం

కన్యాకుమారికి సమీపంలో పోథయాడి గ్రామాన్ని చూసినప్పుడు కొండలు, పచ్చటి చెట్లతో ప్రదేశం బాగుందనిపించింది. ఆశ్చర్యంగా మరో విషయం తెలిసింది. అదేంటంటే... రామాయణంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు వైద్యం కోసం హనుమంతుడు ఏకంగా సంజీవని మొక్క ఉన్న పర్వతం అంతటినీ ఎత్తుకొచ్చాడని విన్నాం. వైద్యం చేసిన తర్వాత ఆ పర్వతాన్ని తిరిగి తీసుకెళ్లే క్రమంలో పర్వతంలోని ఒక శకలం విరిగి కింద పడి పోయిందని, ఆ శకలమే ఈ కొండ అని చెప్పారు స్థానికులు. వాళ్ల విశ్వాసాన్ని పక్కన పెడితే ఆ కొండమీద చుట్టు పక్కల ఉన్న మొక్కలన్నీ ఔషధ మొక్కలే. ప్రకృతితో మమేకమై నివసించడానికి మాకు ఇంతకంటే సౌకర్యవంతమైన ప్రదేశం మరోటి ఉండదేమో అనిపించింది. అంతే... 2021లో నిర్మాణం మొదలు పెట్టాం. ఒక ఏడాదిలో తమిళ, వేనాడు, చెట్టినాడు సంస్కృతుల సమ్మేళనమైన మా ఇంటి నిర్మాణం పూర్తయింది. సంప్రదాయ కళాకృతుల సేకరణ నా హాబీ. ఇంటిని తమిళ సంప్రదాయ సంస్కృతికి ప్రతీకగా మలిచాను. ఇంటి ముఖద్వారం నుంచి నేల, గోడ, మెట్లు, పై కప్పు, అలంకరణ వస్తువులు ప్రతి ఒక్కటీ తమ వైభవాన్ని తామే చెప్పుకుంటాయి. పర్యావరణ హితమైన సున్నపు పొడి ఇటుకలు, ఎర్ర మట్టి, ఆవుపేడ, ధాన్యం పొట్టు, కోడిగుడ్లు, బెల్లంతోపాటు అత్తంగుడి నది తీరాన దొరికే ఇసుకతో తయారు చేసే అత్తంగుడి టైల్స్‌ను వాడాం. పై కప్పుకి కాంక్రీట్ వాడకాన్ని తగ్గించి ఫిల్లర్ స్లాబ్ టెక్నిక్ ఉపయోగించాం. వర్షపు నీటిని నిల్వ చేయడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్, కరెంటుకోసం సోలార్ ప్యానెల్స్ పెట్టాం. ఈ మట్టి సౌధంలో 5 బెడ్ రూమ్‌లు, మూడు బాల్కనీలు, మూడు లివింగ్ స్పేస్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు రెండు వందల మందికి పైగా పర్యాటకులు ఈ హోమ్ స్టేలో బస చేశారు. ఆహారం కూడా తమిళనాట ప్రాంతాల వారీగా విలసిల్లిన విభిన్నమైన రుచులుంటాయి. ఇంటి ఆవరణలో అన్ని రకాల కూరగాయలనూ పండిస్తాం. వంటగదిలో వచ్చే వ్యర్థాలనే ఎరువుగా వేస్తాం" అని తమ పర్యావరణ హిత భవనం ముత్తు నందిని ప్యాలెస్ గురించి వివరించింది జయలక్ష్మి.

పరివర్తన

ఇప్పుడవి రాళ్లు విసిరే చేతులు కాదు

ఆ అమ్మాయి ఒకప్పుడు గుంపులో రాళ్లు విసిరే కశ్మీరీ అమ్మాయి. ఇప్పుడు జమ్ము-కశ్మీర్‌లో కేవలం బాలికల కోసం ఫుట్‌బాల్ అకాడెమీ నడుపుతున్న ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్. ఆమెలో వచ్చిన మార్పు ఆమెను ప్రధాని నరేంద్ర మోదీ చేత కూడా మాట్లాడించేలా చేసింది. విరాట్ కోహ్లీ కూడా ఆమెను మెచ్చుకున్నాడు. యువతకు సరైన దిశ ఉంటే వారు గెలిచి తీరుతారనడానికి అఫ్షాన్ ఆషిక్ ఒక ఉదాహరణ.

కొన్నేళ్లు వెనక్కు వెళితే 2017 డిసెంబర్‌లో ఒక ఫోటో వైరల్ అయ్యింది. ఒకమ్మాయి... ముఖానికి దుపట్టా కట్టుకుని జమ్ము కశ్మీర్ పోలీసులపైకి రాళ్లు విసురుతున్న ఫొటో అది. ఆ అమ్మాయి పేరు అఫ్షాన్ ఆషిక్. ముఖం కనబడకుండా గుడ్డ కట్టుకోవడంతో తనను ఎవరూ గుర్తుపట్టరని అఫ్షాన్ భావించింది. కానీ తర్వాత ఆమె గురించి అందరికీ తెలిసిపోయింది. సమాజం ఆమెపై 'స్టోన్ పెల్టర్' ముద్ర వేసింది. అప్పటికే ఆ అమ్మాయి ఫుట్‌బాల్ ఆటలో ప్రతిభ కనపరుస్తూ ఉంది. కాని ఈ ఫోటోతో ఆమె తన ఆటకే దూరమయ్యే స్థితి వచ్చింది.

'ఆ రోజు నేను పోలీసుల మీద రాళ్లు రువ్వాను. అది కోపంలో చేసిన పని. దానికి కారణం పోలీసులు అకారణంగా మమ్మల్ని వేధించారు. విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టారు. ఇలాంటి పరిస్థితుల్లో మమ్మల్ని మేము కాపాడుకోవడానికి రాళ్లు విసరడం మినహా మాకు గత్యంతరం లేదు. నేనేమి ప్రొఫెషనల్ స్టోన్ పెల్టర్‌ను కాదు. కాని నా మీద ముద్ర పడింది. దాని నుంచి బయటపడాలంటే నేను నా చదువు మీద నా ఫుట్ బాల్ ఆట మీద దృష్టి పెట్టి విజయం సాధించాలని అనుకున్నాను' అంది అఫ్షాన్ ఆషిక్.

ఈ ఘటన తర్వాత ఆ అమ్మాయి నెల రోజులు ఇంటికే పరిమితమైంది. అఫ్షాన్ తండ్రి ఆమెను ఇంటి నుంచి బయటకు వెళ్లనీయలేదు. అరగంటపాటు ఆడుకుని వచ్చేస్తానని తల్లికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. 'ఒకరోజు చాలా ఏడుస్తుంటే నన్ను చూసిన నాన్న ఎందుకు ఏడుస్తున్నావని అడిగారు. ఇంట్లో కూర్చుని ఏం చేయాలని ప్రశ్నించాను. ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు అనుమతించడంతో మళ్లీ ఆట మొదలుపెట్టాను' అందామె.

ముంబై వెళ్లి

కశ్మీర్ యువత తమ చదువు, క్రీడల పట్ల దృష్టి పెట్టాలని భావించిన ప్రభుత్వం అఫ్షాన్‌ను తగిన ప్రోత్సాహం అందించింది. జమ్మూ కశ్మీర్ క్రీడాశాఖ చేయూతతో అఫ్షాన్ ముంబై వెళ్లి ఆటలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత జమ్ము కశ్మీర్ నుంచి తొలి ప్రొఫెషనల్ ఫిమేల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయ్యింది. 'నువ్వు ఆడపిల్లవి. ఫుట్‌బాల్ నేర్చుకుని ఏం చేస్తావ్ అని అందరూ అడిగేవారు. నేను ఆడే సమయానికి ఆడపిల్లలు ఎవరూ మా ప్రాంతం నుంచి ఫుట్‌బాల్‌లోకి రాలేదు. కాని నేను ఆగలేదు. పట్టుదలగా ముందుకెళ్లాను. ఇండియన్ విమెన్స్ లీగ్‌లో ఆడాను. గోల్ కీపర్‌గా విశేష ప్రతిభ కనపరిచాను. ఆ సమయంలో విదేశీ మహిళా ఫుట్‌బాల్ ప్లేయర్లని గమనించాను. వాళ్లకు చాలా మంచిశిక్షణ ఆ దేశాల్లో లభిస్తోంది. మా ప్రాంతం బాలికలకు కూడా లభించాలని భావించాను. అందుకే జమ్ము కశ్మీర్ బాలికల కోసం యునీక్ ఫుట్‌బాల్ అకాడెమీ స్థాపించాను' అని తెలిపింది అఫ్షాన్.



అఫ్షాన్ ఆషిక్



ఆరోజుల్లో రాళ్లు విసురుతున్న అఫ్షాన్ ఆషిక్

మరింత గుర్తింపు

నేడు జమ్ము కశ్మీర్‌లో మహిళా ఫుట్‌బాల్ పేరు చెప్తే అఫ్షాన్ పేరే అందరికీ గుర్తుకొస్తుంది. ఆమెకు అక్కడ ఒక సెలబ్రిటీ హోదా ఉంది. 'నేను నా గతాన్ని జయించాను. ఇప్పుడు నేను స్టోన్ పెల్టర్‌ని కాను. గోల్ కీపర్‌ని. ఇకపై నన్ను జనం అలాగే గుర్తు పెట్టుకుంటారు' అంటుందామె.